## ఇక ఉద్యోగులకు ఎఫ్ఆర్ఎస్







## నగరంలో చైన్ స్నాచింగ్



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

10-12-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## రెండో విడత ఎన్నికలు.. 12న ప్రచారం బంద్

**అక్షరటుడే, ఇందూరు:** రెండో విడత పంచాయతీ ఎన్నికల సందర్భంగా 12వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ప్రచారంపై నిషేధం అమల్లోకి వస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి, మోపాల్, నిజామాబాద్, సిరికొండ జక్రాన్ పల్లి మండలాల్లో ఈనెల 14న ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఈ నేపథ్యం 12వ తేదీ సాయంత్రం తర్వాత ఎన్నికల ప్రచారం చేయరాదని సూచించారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, ఎంసీసీ బృందాలు పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికలు ముగిసే వరకు సంబంధిత మండలాల్లో మద్యం, కల్లు దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు.



## ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు :** మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి అందజేసే సామగ్రి పంపిణీ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి బుధవారం సందర్శించారు. వర్ని, చందూర్, మోస్రా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో పంపిణీ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికల సామగ్రిని ఎలాంటి లోటుపాట్లు గందరగోళానికి తావు లేకుండా పక్కాగా అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. చెక్‌లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందిందా లేదా పరిశీలించుకోవాలని సూచించారు. సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించారు. సామాగ్రి, బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో సాయుధ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా పాలనాధికారి పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని ఆర్వోలకు సూచించారు. అలాగే నవీపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఎన్నికల పరిశీలకుడు శ్యాంప్రసాద్ లాల్ సందర్శించారు.



## ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేలా చూడాలి

**అక్షరటుడే, కామారెడ్డి :** ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పోలింగ్ అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో బుధవారం రాజంపేట్, దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూటర్ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొదటి విడతలో మొత్తం 167 జీపీలలో ఎన్నికలు జరగాల్సి ఉండగా 11 పంచాయతీలలో ఏకగ్రీవం కావడంతో 157 గ్రామాల్లో ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. మొత్తం 1,457 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొత్తం 2,48,668 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుష ఓటర్లు 1,18,342, మహిళా ఓటర్లు 1,30,322, ఇతరులు నలుగురు ఉన్నారని తెలిపారు. 1,457 పోలింగ్ కేంద్రాల్లో 1,848 మంది పోలింగ్ అధికారులు, 2,501 ఇతర పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా జరిగేలా చూడాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. ఎలాంటి అడ్డంకులు లేకుండా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.



# పల్లె పోరుకు వేళాయె..

**పల్లె పోరుకు వేళ అయింది. దాదాపు 18 నెలలుగా పాలకులు లేక బోసిపోయిన పల్లెలకు కొత్త పాలకవర్గాలు రానున్నాయి. ఉమ్మడి జిల్లాలో తొలి దశ పంచాయతీ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. పోలింగ్ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారులు సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై సమీక్షించారు. సాకర్యాలతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.**

**- అక్షరటుడే, ఇందూరు**

- ■ రేపే తొలిదశ పంచాయతీ ఎన్నికలు
- ■ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ■ మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్
- ■ సాయంత్రంలోపు తేలనున్న ఫలితాలు



నిజామాబాద్ జిల్లాలోని బోధన్ డివిజన్‌లో తొలి విడత ఎన్నికలు జరగనున్నాయి. బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పోతంగల్, రెంజల్, రుద్రూర్, సాలూర, వర్ని, ఎడపల్లి, నవీపేట మండలాల్లో గురువారం ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 184 పంచాయతీలకు గాను ఇప్పటికే 29 గ్రామాల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా 155 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అలాగే 1,642 వార్డు స్థానాలకు 575 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో 1,060 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఏడు వార్డులకు అసలు నామినేషన్లు రాలేదు.

### కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి జిల్లాలో మొదటి విడతలో భిక్కనూరు, బీబీపేట, దోమకొండ, కామారెడ్డి, మాచారెడ్డి, పాల్వంచ, రాజంపేట, రామారెడ్డి, సదాశివనగర్, తాడ్వాయి మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 167 సర్పంచ్, 1,520 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా.. ఇప్పటికే 10 మంది సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల కోసం జిల్లాలో 1457 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

### పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది

పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం మధ్యాహ్నం నుంచి సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల్లో పోలింగ్‌కు సంబంధించిన సామగ్రిని సిబ్బందికి అందజేశారు. ప్రిసైడింగ్ ఆఫీసర్‌ల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి లోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సిబ్బంది తరలింపునకు నిజామాబాద్‌లో 59 రూట్లలో వాహనాలను సైతం ఏర్పాటు చేశారు.

### ప్రలోభాలపై నిఘా

ఎన్నికలకు ఒకేరోజు ఉండడంతో గ్రామాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా ఉండేలా తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే రూ.లక్షల విలువ చేసే మద్యాన్ని పట్టుకొని సీజ్ చేశారు. నిజామాబాద్ జిల్లాలో 31 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. కొన్ని మేజర్ పంచాయతీల్లో డబ్బు, మద్యం జోరుగా చేతులు మారే అవకాశం ఉంది. ఎన్నికలు జరిగే గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

### మధ్యాహ్నామే లెక్కింపు

పంచాయతీ ఎన్నికలు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగనున్నాయి. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఫలితాల ప్రకటన అనంతరం ఉప సర్పంచ్‌ను సైతం ఎన్నుకుంటారు. నిజామాబాద్ జిల్లాలో మొద టి విడతలో ఇప్పటికే 29 ఏకగ్రీవం కాగా.. 155 సర్పంచ్ స్థానాల భవితవ్యం రేపు సాయంత్రంలోపు తేలనుంది.

## ఎన్నికలకు 1,384 సిబ్బందితో భారీ బందోబస్తు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బోధన్ డివిజన్‌లో గురువారం జరిగే పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశామని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన విడుదల చేశారు. ప్రజలందరూ ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని సీపీ పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా బందోబస్తుకు 1,384 మంది సిబ్బందితో భారీ ఏర్పాట్లు చేశామని వివరించారు. ఇద్దరు డీసీపీలు, ఐదుగురు ఏసీపీలు, 17 మంది సర్కిల్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, 71 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 74 మంది ఏఎస్సైలు, ఆర్ఎస్సైలు, 192 హెడ్‌కానిస్టేబుళ్లు, 789 కానిస్టేబుళ్లు, మహిళ కానిస్టేబుళ్లు, 233 హోంగార్డులు/మహిళా హోంగార్డులు బందోబస్తు విధుల్లో ఉంటారన్నారు.



## కేంద్ర మంత్రులను కలిసిన ఎంపీ అర్వింద్

**అక్షరటుడే, ఇందూరు:** కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, అశ్విని వైష్ణవ్‌లను ఎంపీ అర్వింద్ ధర్మపురి కలిశారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ కార్యాలయంలో మంత్రులను వేర్వేరుగా కలిసి పలు విజ్ఞప్తులను అందజేశారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో పిట్ లైన్‌ల ఏర్పాటు, పార్లమెంట్ నియోజకవర్గం మీదుగా పలు రైళ్ల పొడిగించాలని కోరారు. వందే భారత్ సహా పలు నూతన రైళ్ల మంజూరు, అయ్యప్ప స్వాముల కోసం కొల్లాంకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కేంద్ర జాతీయ రహదారులు, రవాణా శాఖ మంత్రి గడ్కరీని కలిసి జగిత్యాల జిల్లాలో ఎన్‌హెచ్ 61, 63లలో హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణం, ఫ్లైఓవర్లు, అండర్ పాసుల నిర్మాణాలు చేపట్టాల్సిందిగా కోరారు. మంజూరుకు తక్షణమే మౌఖికంగా హామీ ఇచ్చి, సాంకేతికంగా మంజూరుకు తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రులకు ఎంపీ ధన్యవాదాలు తెలిపారు.



## కేంద్ర రైల్వేమంత్రిని కలిసిన ఎమ్మెల్యే కేవీఆర్

**అక్షరటుడే, కామారెడ్డి:** కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి బుధవారం కలిశారు. జిల్లా కేంద్రంలో మూడు ఆర్వోబీలు, ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా కేంద్రంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్టిలో పెట్టుకొని స్నేహపురి కాలనీ నుంచి కలెక్టర్ కార్యాలయం రోడ్ వరకు రైల్వేలైన్ మీదుగా ఒక ఆర్వోబీ అవసరం ఉందని విన్నవించారు. కేంద్ర మంత్రి కూడా బ్రిడ్జిల నిర్మాణానికి నిధుల మంజూరుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలో రైల్వే అధికారులు స్థల పరిశీలన చేయాలని కేంద్ర మంత్రి ఆదేశించినట్లు చెప్పారు.



## ఎన్నికల కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, బోధన్:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసు సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సీపీ సాయిచైతన్య ఆదేశించారు. సాలూర మండల కేంద్రంలో మొదటి విడత పోలింగ్ గురువారం జరుగనున్న నేపథ్యంలో ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాల్లో ప్రత్యేక నిఘా పెట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఎన్నికల కమిషన్ నియమనిబంధనలకు అనుగుణంగా ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని పేర్కొన్నారు. సాలూర మండలంలోని ఎన్నికల కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేశామని సీపీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు మొత్తం 100 మంది పోలీస్ సిబ్బందిని బందోబస్తు కోసం ఏర్పాటు చేసినట్లు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. పోలీస్ శాఖ ప్రజల బాగోగులు, శాంతి భద్రతల కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు చేసేవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, రూరల్ ఎస్సై మచ్చేందర్, ఎలక్షన్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లను అభినందించిన ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జుక్కల్ మండలంలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావును క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. గ్రామాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. బిజ్జల్ వాడి గ్రామంలో గంగు బాయి, బంగారుపల్లి గ్రామంలో గాయబాయి మాణిక్ రావు, చిన్నగుల్ల గ్రామంలో జ్ఞానేశ్వర్, మధురి తండాకు అనిత మోహన్, దోస్త్ పల్లి గ్రామంలో మారుతిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే పిట్లం మండలం గౌరారం తండాలో నరేంద్ర సింగ్ ఏకగ్రీవం అయ్యారు. ఏకగ్రీవమనేది గ్రామాల్లో ఐక్యతను ప్రతిబింబిస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే ప్రజల విశ్వాసానికి అనుగుణంగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం తరపున ఎల్లప్పుడు మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.



## అబార్షన్ చేసిన ఆస్పత్రిపై చర్యలకు వెనుకంజ..?

**అక్షరటుడే, కామారెడ్డి :** పెళ్లి కాకుండా గర్భవతి అయిన అమ్మాయికి అబార్షన్ చేసిన ఘటన ఇటు వైద్యాధికారులు, అటు పోలీసు అధికారులను ఉరుకులు పరుగులు పెట్టిస్తోంది. 'అక్షరటుడే' ఈ ఘటనను వెలుగులోకి తీసుకురాగా జిల్లా యంత్రాంగంలో చలనం వచ్చింది. విచారణ సాధ్యమైనంత త్వరలో ముగించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఆస్పత్రిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకంజ వేస్తున్నారన్న ప్రచారం కూడా సాగుతోంది. ఈ ఘటనపై లోతుగా సమాచారం తెలుసుకునే ప్రయత్నంలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కామారెడ్డిలో పలు ఆస్పత్రులను మెయింటెన్ చేసే వ్యక్తి అబార్షన్ చేసిన ఆస్పత్రిలో కూడా భాగస్వామిగా ఉన్నట్టుగా తెలుస్తోంది. ఆయనతో పాటు ఓ మాజీ కౌన్సిలర్ కూడా ఆస్పత్రిలో పార్ట్‌నర్‌గా ఉన్నారని సమాచారం. ఇద్దరు వ్యక్తులు కూడా రాజకీయ నాయకులతో సత్సంబంధాలు ఉన్నట్టుగా తెలిసింది. ఈ క్రమంలో ఆస్పత్రి పేరు బయటకు రాగానే సదరు భాగస్వాములు అప్రమత్తమైనట్టుగా సమాచారం. ఇటు పోలీసులు, అటు వైద్యశాఖ నుంచి ఆస్పత్రిపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. చిన్న విషయం అయితే సదరు భాగస్వాములే సెటిల్ చేసేవారని, అబార్షన్ ఘటనపై సీరియస్‌గా విచారణ జరుగుతుండడంతో ఓ బడానేతను రంగంలోకి దింపే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై ఎస్పీ కూడా సీరియస్‌గా ఉండడంతో బాధిత కుటుంబానికి నచ్చజెప్పి కేసు నీరుగార్చే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నట్టుగా ప్రచారం సాగుతోంది. కామారెడ్డి పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ ఆస్పత్రి, స్కానింగ్ సెంటర్లను కాపాడేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ఇటు పోలీసులు, అటు వైద్యాధికారులు ఆస్పత్రిపై చర్యలు తీసుకుంటారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ అబార్షన్ ఘటనలో ఓ పీఎంపీ వైద్యుడి హస్తం ఉన్నట్టుగా ప్రచారం సాగుతోంది. సదరు పీఎంపీ సూచనతోనే స్కానింగ్ సెంటర్‌కు వెళ్లి పరీక్ష చేసుకున్నారని, ఆ తర్వాత ఆస్పత్రి గైనిక్ వైద్యురాలిని సంప్రదించినట్టుగా సమాచారం. ఇప్పటికే రెండుసార్లు సదరు పీఎంపీ వైద్యుడిని పోలీస్ స్టేషన్‌కు కూడా పిలిపించి విచారణ జరిపినట్లుగా తెలుస్తోంది. పోలీసుల విచారణ అనంతరం ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని పలువురు నేతలు పీఎంపీపై చర్యలు తీసుకోకుండా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లుగా సమాచారం. ఇదిలా ఉండగా ఈ ఘటనకు కర్త, కర్మ క్రియ అయిన వ్యక్తిపై పోలీసులు ఇప్పటికే పోక్సో కేసు నమోదు చేశారు. గత ఆరు రోజులుగా అతన్ని పోలీస్ కస్టడీలో ఉంచుకుని విచారణ జరిపినట్లుగా తెలుస్తోంది. అతడిని రిమాండ్‌కు తరలించే యోచనలో పోలీసులు ఉన్నట్టుగా సమాచారం.



## మాక్లూర్‌లో వినయ్ కుమార్ రెడ్డి ప్రచారం

**అక్షరటుడే, ఆర్మూర్:** మాక్లూర్ మండలం దుర్గానగర్ తండాలో సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ అభ్యర్థి పరశురాం ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్యాలయానికి నిధులు ఇప్పిస్తానన్నారు. అలాగే సేవాలాల్ మందిరానికి రూ.5 లక్షల ప్రభుత్వ నిధులతో పాటు తన తరపున ఆర్థిక సహాయం చేస్తానని తండావాసులకు వివరించారు. కాంగ్రెస్ మద్దతుదారులను సర్పంచ్‌లుగా గెలిపిస్తే అభివృద్ధి వేగంగా జరుగుతుందని ఆయన వివరించారు.




## నాడు ఏకగ్రీవం.. నేడు పోటాపోటీ..

**అక్షరటుడే, బాన్సువాడ :** సర్పంచ్ ఎన్నికల సందర్భంగా బాన్సువాడ మండలం సోమేశ్వర్ గ్రామంలో తీవ్రమైన పోటీ నెలకొంది. 2018 సర్పంచ్ ఎన్నికల్లో ఈ పంచాయతీ ఏకగ్రీవంగా ఎన్నికైనప్పటికీ, ఈసారి పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయి. ఎనిమిది మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో దిగడంతో గ్రామ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మొత్తం 1,465 మంది ఓటర్లు ఉండగా, విభిన్న వర్గాల నుంచి పోటీదారులు రంగంలోకి దిగడంతో ఎన్నికల ప్రచారం ఉత్కంఠ భరితంగా కొనసాగుతోంది. అభ్యర్థులు ఇంటింటికీ తిరుగుతూ గెలుపు కోసం అహర్నిషలు కృషి చేస్తున్నారు. ఎనిమిది మంది పోటీలో ఉండడంతో గ్రామస్థుల్లో కూడా ఎన్నికలపై ఆసక్తి పెరిగింది. గతంలో ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామం ఈసారి తీవ్రమైన పోటీకి వేదిక కావడంతో ఎన్నికల ఫలితాలపై సర్వత్రా చర్చ నడుస్తోంది. వివిధ వర్గాల సమీకరణలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఇచ్చే హామీలు ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## ఆటో బోల్తా పడి పదో తరగతి విద్యార్థి మృతి

**అక్షరటుడే, కామారెడ్డి :** విద్యార్థులతో వెళ్తున్న ఓ స్కూల్ ఆటో బోల్తాపడి పదో తరగతి విద్యార్థి మృతి చెందాడు. జుక్కల్ మండలం సావర్‌గావ్ వద్ద బుధవారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ప్రతిరోజు మాదిరిగానే జుక్కల్ మండలం సావర్‌గావ్ నుంచి విద్యార్థులను తీసుకుని ఆటో ఖండే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు బయలుదేరింది. గ్రామ శివారులోకి చేరుకున్నాక ఒక్కసారిగా బోల్తాపడింది. దీంతో విద్యార్థులు హాహాకారాలు చేశారు. ఈ ప్రమాదంలో పదో తరగతి విద్యార్థి ప్రణవ్(15) అక్కడికక్కడే మృతిచెందగా.. మరొక 14 మంది విద్యార్థులు గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దఎత్తున ఆస్పత్రికి చేరుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


## ఆటో ప్రమాద బాధిత కుటుంబానికి అండగా ఉంటాం:ఎమ్మెల్యే



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జుక్కల్ మండలం సావర్‌గావ్‌లో ఆటో బోల్తాపడి మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో ఆయన ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులకు ఫోన్ చేసి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విద్యార్థి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, ప్రభుత్వం తరపున సహాయం అందించి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లోని బాలలకు నాణ్యమైన విద్యను అందిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు సమగ్ర శిక్ష పథకం ఉద్యోగులు ఎంతగానో కృషి చేస్తున్నారు. మండల వనరుల కేంద్రంతో పాటు జిల్లా విద్యాశాఖలో ప్రత్యేకంగా ఉన్న సమగ్ర శిక్ష కార్యాలయంలో వీరు విధులు నిర్వహిస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం వీరికి కూడా ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేస్ రికగ్నిషన్ టైమ్ అటెండెన్స్ సిస్టమ్)ను ప్రవేశపెట్టింది. తద్వారా వారు సైతం సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలని సూచించింది.

– అక్షరటుడే, ఇందూరు




# ఇక ఉద్యోగులకు ఎఫ్‌ఆర్‌ఎస్

■ సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఫేషియల్ అటెండెన్స్ ■ అమల్లోకి వచ్చిన పద్ధతి ■ సిబ్బంది సమయపాలన పాటించాల్సిందే..

జిల్లాలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సమయపాలనను గాడిలో పెట్టేందుకు ఫేషియల్ అటెండెన్స్ దోహద పడుతుంది. జిల్లా కార్యాలయంలో ఏపీవో, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, అటెండర్లు మొత్తం 15 మంది వరకు పనిచేస్తుండగా.. ప్రతి మండలంలోని మండల విద్యా వనరుల కేంద్రాల పరిధిలో సీఆర్పీలు, ఎంఐఎస్, కంప్యూటర్ ఆపరేటర్లు మెసెంజర్లు పనిచేస్తున్నారు. సమగ్ర శిక్ష అమలు చేసే ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంతో పాటు ఉపాధ్యాయులకు శిక్షణ, వివిధ రకాల పథకాల అమలు, విద్యారంగానికి సంబంధించిన అనేక రకాల వివరాల సేకరణలో వీరు పని చేస్తున్నారు.

### సమగ్రశిక్షలో..

జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగులు సిబ్బంది సుమారు 110 మంది పనిచేస్తున్నారు. వీరికి ఈనెల 8 నుంచి ముఖ గుర్తింపు హాజరును అమలు చేశారు. ఇప్పటికే పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు జూలై నుంచి ఫేషియల్ అటెండెన్స్‌ను అమలు చేస్తున్నారు. ఈ విధానం సత్ఫలితాలు ఇవ్వడంతో సమగ్ర శిక్ష ఉద్యోగులు, సిబ్బందికి కూడా అమలు చేశారు.

### దుమ్మా కొట్టకుండా ఉండేందుకే..

ఉద్యోగులు, సిబ్బంది విధులకు దుమ్మా కొట్టకుండా ఉండేందుకు విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. తమ ఫోన్లలో ప్రత్యేకంగా రూపొందించిన డీఎస్‌ఈ ఎఫ్‌ఆర్‌ఏ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని నిత్యం హాజరును వేయాల్సి ఉంటుంది. ఒకవేళ పెద్ద ఫోన్ అందుబాటులో లేని ఉద్యోగులు తమ సహచర ఉద్యోగుల ఫోన్లలో లాగిన్ చేసి హాజరును వేయాల్సి ఉంటుంది.

## పీసీసీ చీఫ్‌ను కలిసిన రహత్ నగర్ సర్పంచ్

**అక్షరటుడే, భీమ్‌గల్:** రహత్ నగర్ గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన తిరుపతి బుధవారం హైదరాబాద్‌లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తన సొంత గ్రామమైన భీమ్‌గల్ మండలం రహత్ నగర్‌లో సర్పంచ్ ఏకగ్రీవంగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తిరుపతిని శాలువాతో సత్కరించారు. రహత్ నగర్ గ్రామం అభివృద్ధి కోసం సహకరించాలని ఈ సందర్భంగా నూతన సర్పంచ్ పీసీసీ అధ్యక్షుడిని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారు.



తిరుపతి వెంట మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం నాయకులు గోపాల్ నాయక్, సంగ్యా నాయక్ ఉన్నారు.



## పంచాయతీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులనే గెలిపించండి

**అక్షరటుడే, ఇందూరు:** మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను పెద్దఎత్తున గెలిపించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కులాలకు, బంధుత్వాలకు అతీతంగా, ప్రలోభాలకు లొంగకుండా బీసీ అభ్యర్థులకు ఓటు వేయాలన్నారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాబోతుండగా అడ్డుకున్న కొందరు అగ్రవర్ణాలకు బుద్ధి చెప్పాలంటే బీసీలంతా ఏకం కావాలన్నారు. అందరూ ఐక్యతతో బీసీలకు ఓట్లేస్తే 70 శాతం పంచాయతీలను గెలిపించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు ఆకుల ప్రసాద్, దర్శనం దేవేందర్, శంకర్, వాసం జయ, సాయి, బాలన్న, సురేందర్, రవీందర్ పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు



**అక్షరటుడే, భీమ్‌గల్:** పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని, ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. భీమ్‌గల్‌లోని ఫంక్షన్ హాల్‌లో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సర్పంచ్ అభ్యర్థి ఇల్లు దగ్ధం.. రూ. 7 లక్షల నగదు బుగ్గిపాలు

**అక్షరటుడే, గాంధారి:** ఊరికి వెళ్లి వచ్చేసరికి సర్పంచ్ అభ్యర్థి ఇంటితో సహా ఆమె తల్లిదండ్రుల ఇల్లు సైతం మంటల్లో కాలిపోయింది. ఈ ఘటనలో రూ. 7 లక్షల నగదు పూర్తిగా బుగ్గిపాలైంది. ఈ సంఘటన గాంధారి మండలంలోని చద్మల్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చద్మల్ గ్రామానికి చెందిన మరాఠి రోజా సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో నిలబడింది. అయితే బుధవారం గాంధారిలో నిర్వహించిన ఓ సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్లింది. అక్కడే తన కూతురు బర్త్‌డే సందర్భంగా షాపింగ్ కూడా చేసింది. అయితే తన ఇల్లు కాలిపోయిందనే ఫోన్‌లో స్థానికులు సమాచారం ఇవ్వగా ఆమె పరుగు పరుగున చద్మల్ గ్రామానికి చేరుకుంది. అప్పటికే ఆమె ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఆ ఇంట్లో రూ.3 లక్షల నగదు అగ్నికి ఆహుతైంది. అలాగే తులంన్నర బంగారు కమ్మలు, 25తులాల వెండి, దుస్తులు కాలిపోయాయి. అలాగే పక్కనే ఉన్న రోజా తల్లిదండ్రుల ఇంట్లో ఉన్న రూ.4 లక్షలు నగదు, 40 తులాల వెండి కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సమాచారం అందుకున్న ఆర్ఐ సంఘటనాస్థలానికి చేరుకుని పంచనామా చేశారు.



## కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్‌గా నరేష్ రాథోడ్ నియామకం



**అక్షరటుడే, బాన్సువాడ:** ఆల్ ఇండియా ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ కో-ఆర్డినేటర్‌గా నస్రుల్లాబాద్ మండలం మైలారం గ్రామానికి చెందిన నరేష్ రాథోడ్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియామక పత్రం అందజేశారు. జాతీయ కో-ఆర్డినేటర్‌గా నియమితులైన నరేష్ రాథోడ్‌కు ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా కో-ఆర్డినేటర్ అంబర్ సింగ్, పాత బాలకృష్ణ, ప్రతాప్‌సింగ్, మాసాని శ్రీనివాస్ రెడ్డి, కొత్తకొండ భాస్కర్, అక్బర్ తదితర నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరించారు. బుధవారం ఆయన కామారెడ్డి, రాజంపేట మండలాల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. చిన్న మల్లారెడ్డి, రాజంపేట పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ అక్కడ విధుల్లో ఉన్న సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో మాట్లాడి ఏర్పాట్లను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు చేశారు.

## భూ తగాదాలతో ఒకరి దారుణ హత్య

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో ఓ వ్యక్తి దారుణ హత్య కలకలం రేపింది. భూ తగాదాల నేపథ్యంలో జరిగిన ఈ హత్య బీబీపేట మండలం శివారు రాంరెడ్డి పల్లి శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బీబీపేట్ మండల కేంద్రంలోని శివారు రాంరెడ్డిపల్లికి చెందిన కోక్కోల సత్యం (50) లచ్చయ్యలు గ్రామంలో పక్కపక్కనే నివాసం ఉంటారు. అలాగే వారి వ్యవసాయ భూమి కూడా పక్కపక్కనే ఉంది. కొంతకాలంగా సత్యం, లచ్చయ్యల మధ్య భూ వివాదం కొనసాగుతోంది. ఈ విషయంలో లచ్చయ్య, సత్యం తరచూ గొడవపడేవారు. మంగళవారం రాత్రి లచ్చయ్య కొకోళ్ల సత్యంను కర్రతో కొట్టి దారుణంగా హత్య చేశాడు. అనంతరం లచ్చయ్య స్థానిక బీబీపేట్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు రాంరెడ్డి పల్లికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జీజీహెచ్‌కు తరలించారు.

## ఆర్మూర్ పట్టణంలో అల్ప్రాజోలం పట్టివేత

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలో పలు ఇళ్లపై పోలీసులు దాడులు నిర్వహించారు. కాలనీలో రావుట్ల ప్రణీత్‌గౌడ్, అశోక్ గౌడ్ ఇళ్లల్లో అల్ప్రాజోలం ఉన్నట్లు పక్కా సమాచారంతో నార్కోటిక్, ఆర్మూర్ పోలీసులు సంయుక్తంగా సోదాలు చేశారు. ఈ సందర్భంగా సుమారు 500 గ్రాముల అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.3 లక్షల వరకు ఉంటుందని వారు పేర్కొన్నారు. అనంతరం వారిరువురిపై కేసు నమోదు చేసినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ దాడుల్లో నార్కోటిక్ సీఐ పూర్ణేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

## రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** రైలులో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని రైల్వేస్టేషన్‌లో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే ఆర్‌హెచ్‌సీ హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వేస్టేషన్‌లో ఉదయం ప్లాట్‌ఫాం నం.3 నుంచి రైలు ఎక్కేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తి కాలుజారి ప్లాట్‌ఫాంకు రైలుకు మధ్య ఇరుక్కుపోయాడు. దీంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వేస్టేషన్ మేనేజర్ కిరణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసుమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతి చెందిన వ్యక్తి కుడిచేతికి ఒక వేలు లేదని తెలిపారు. ఎవరికైనా మృతుడి సమాచారం తెలిస్తే రైల్వే కానిస్టేబుల్ 8712568440ను సంప్రదించాలని కోరారు.

## మద్యం మత్తులో హోంగార్డుపై దాడి.. ముగ్గురిపై కేసు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** మద్యం మత్తులో ముగ్గురు యువకులు హోంగార్డుపై దాడిచేశారు. ఈ ఘటన మంగళవారం రాత్రి నగరంలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిఖిల్‌సాయి చౌరస్తా సమీపంలో మంగళవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తూ.. ముగ్గురు వ్యక్తులు వెళ్తున్న ఓ కారును ఆపారు. అనంతరం వారిని హోంగార్డు గంగామోహన్‌తో కూడిన బృందం తనిఖీలు చేస్తుండగా వారు ఆయనపై దాడికి తెగబడ్డారు. దీంతో స్పందించిన పోలీసులు ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని వన్ టౌన్‌కు తీసుకెళ్లారు. అనంతరం హోంగార్డు గంగామోహన్ ఫిర్యాదు మేరకు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే మద్యం మత్తులో ఉన్న ముగ్గురు ప్రయాణిస్తున్న కారును తనిఖీ చేయగా అందులో మద్యం బాటిళ్లు.. గంజాయి లభ్యమైంది. దీంతో పోలీసులు గంజాయిని ఎక్కడ తీసుకున్నారు. దీని వెనక ఉన్న వారిపై గురించి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## నగరంలో చైన్ స్నాచింగ్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** తెల్లవారు జామున ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళ మెడలో నుంచి దుండగులు చైన్ లాక్కుని పారిపోయారు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని నాలుగో టౌన్ పరిధిలో బుధవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని వినాయక్‌నగర్ ప్రాంతంలో బుధవారం తెల్లవారు జామున స్వరూప అనే మహిళ ఇంటి ముందు ముగ్గు వేస్తోంది. ఈ సమయం ఇద్దరు దుండగులు బైకుపై వచ్చారు. ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసు ను తెంపుకుని పారిపోయారు. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నాలుగోటౌన్ ఎస్‌హెచ్‌వో సతీశ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.